ఇంటింటికీ రేషన్‌కు మంగళం

- జిల్లా కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు వెల్లడి
- మళ్లీ రేషను దుకాణాల్లోనే పంపిణీ
- ఎండీయూ ఆపరేటర్లకు మొండిచెయ్యి



ఎండీయూ వాహనం ద్వారా రేషను పంపిణీ

తెనాలి: ఇంటింటికీ రేషను డోర్ డెలివరీ విధానానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్ల సమావేశంలో స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. రేషను కార్డుదారులకు ముఖ్యమంత్రి ప్రకటన అశనిపాతమైంది. మళ్లీ బియ్యం కోసం రేషను దుకాణాలకు వెళ్లాల్సిందేనని స్పష్టంచేసినట్టయింది. ఇప్పటివరకు ఇంటింటికీ రేషను అందించిన ఎండీయూ వాహనాలు ఇకపై రావు. వేతనంపై పనిచేసిన ఎండీయూ ఆపరేటర్లు ఇకపై మరో ఉపాధికోసం వెతుకులాట అనివార్యంగా కనిపిస్తోంది.

రేషను దుకాణాలకు వెళ్లి బియ్యం, ఇతర నిత్యావసరాలను తీసుకోవటంలో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇంటింటికీ రేషను డోర్ డెలివరీ విధానానికి రూపకల్పన చేసింది. ప్రత్యేకంగా ఎండీయూ వాహనాలను తీసుకొచ్చారు. రేషను దుకాణాల్నుంచి సరుకులను తీసుకుని, ఎండీయూ ఆపరేటర్లు ప్రతి నెల ఒకటో తేదీ నుంచి ఇంటింటికీ రేషన్ డోర్ డెలివరీ చేస్తున్నారు. ఒక్కో ఎండీయూ వాహనంతో 1,500 నుంచి 2,000 రేషను కార్డుదారులకు బియ్యం, పంచదార పంపిణీ చేస్తున్నారు. ఈ పథకం అమల్లోకి వచ్చి ప్రస్తుతం నాలుగో ఏడాది నడుస్తోంది.

డోర్ డెలివరీ పథకం కింద తెనాలి నియోజకవర్గంలో మొత్తం 85,925 మంది రేషను కార్డుదారులకు ప్రయోజనం కలుగుతోంది. ప్రతినెలా వీరికి 12,687.45 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేస్తున్నారు. తెనాలి పట్టణంలో 44,400, రూరల్ మండలంలో 22,400 రేషను కార్డులు ఉండగా, కొల్లిపర మండలంలో 19,125 మంది రేషను కార్డుదారులు ఉన్నారు. పట్టణం, రూరల్ మండలానికి కలిపి 10,041.60 క్వింటాళ్లు, కొల్లిపర మండలంలో 2,645.85 క్వింటాళ్ల బియ్యాన్ని అందజేస్తున్నారు. కార్డుకు అరకిలో చొప్పున పంచదారను అందిస్తున్నారు. తూకంలో తేడా ఉందంటూ గత జులై నెల, ప్రస్తుత ఆగస్టు నెలకు పంచదార పంపిణీని ప్రభుత్వం నిలిపివేసింది. ముఖ్యమంత్రి తాజా నిర్ణయంతో కార్డుదారులంతా రేషను దుకాణాలకు వెళ్లాల్సిన ఆవశ్యకత ఏర్పడనుంది.

పట్టణంలో 24, రూరల్ మండలంలో 16, కొల్లిపర మండలంలో 12 చొప్పున నియోజకవర్గంలో మొత్తం 52 ఎండీయూ వాహనాలు పనిచేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారికి 60 శాతం సబ్సిడీపై బ్యాంకుల ద్వారా ఇచ్చిన రుణంతో ఈ వాహనాలను సమకూర్చింది.10 శాతం డౌన్‌పేమెంటు, ఖర్చులతో కలిపి రూ.80 వేలను ఒక్కో ఎండీయూ ఆపరేటరు ముందుగానే చెల్లించారు. మిగిలిన రూ.5 లక్షల్లో రూ.3 లక్షలు ప్రభుత్వం, రూ.2 లక్షలు ఎండీయూ ఆపరేటరు ఈఎంఐల రూపంలో చెల్లించాలి. రేషను పంపిణీకి ఎండీయూ ఆపరేటరుకు రూ.21 వేల వేతనం ప్రభుత్వం చెల్లిస్తోంది. నెలనెలా వీరి వేతనంలో రూ.3 వేలను మినహాయించి, ప్రభుత్వం రూ.5,890 కలిపి, మొత్తం రూ.8,890 ఈఎంఐలను సంబంధిత బ్యాంకులకు జమచేస్తూ వస్తోంది.

ఎండీయూ వాహన రుణపరిమితి కాలం 72 నెలలు. ఇప్పటికి 44 నెలలు పూర్తయింది. ఇంకా 28 నెలలు వాహన రుణాలను చెల్లించాల్సి ఉంది. రిజిస్ట్రేషను చేసి మరీ ప్రభుత్వం ఈ వాహనాలను అప్పగించింది. ఇంటింటికీ రేషను డోర్ డెలివరీ పథకం రద్దు చేస్తే తమ పరిస్థితి ఏమిటని ఎండీయూ ఆపరేటర్లు ఆందోళన పడుతున్నారు. వీరితోపాటు 52 వాహనాలకు బియ్యం పంపిణీకి 52 మంది సహాయకులు ఉన్నారు. బియ్యం లోడింగ్‌కు మరికొందరు వర్కర్లు పనిచేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఒక్క తెనాలి నియోజకవర్గంలోనే ఆపరేటర్లు, సహాయకులు, వర్కర్లు కలిసి దాదాపు 125 మంది ఉపాధిని కోల్పోతున్నారు. కనీసం ఈఎంఐలైనా క్లియర్ చేసి, తమ వాహనాలు తమకు ఇచ్చేసి, వేరే ఏదైనా పనిచూపించాలని వీరంతా కోరుతున్నారు.

మా లాంటి దివ్యాంగుల పరిస్థితి ఏమిటి..?



నేను భీమవరపు శివమ్మ ఒంటరిని. నాలుగేళ్ల క్రితం ఇంట్లో బూజు దులుపుతూ నిచ్చన నుంచి కింద పడి తొంటి వద్ద విరిగింది. కర్ర సాయంతో ఇంట్లోకి, బయటికి మాత్రమే రాగలుగుతున్నా.. ఇంటికి రేషను వస్తుండటంతో తేలికగా ఉంది. ఈ పథకాన్ని నిలిపివేస్తే మాలాంటివారి సంగతేంటి? అరకిలో మీటరు దూరంలో ఉన్న రేషన్ దుకాణానికి వెళ్లి బియ్యం ఎలా తెచ్చుకోవాలి? మాలాంటి వృద్ధులు, ఒంటరివారికి ఇంటివద్దనే బియ్యం, పంచదార ఇచ్చే ఏర్పాటును ప్రభుత్వం కొనసాగించాలి.

– భీమవరపు శివమ్మ , ఒంటరి వృద్ధురాలు, తూములూరు

ఇంటి వద్దనే రేషన్ అందించాలి



వాహనాలు ద్వారా ఇంటివద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. మాలాంటి వృద్ధులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ప్రతి నెల గ్రామంలో ఉన్న రేషన్ దుకాణాలకు వెళ్లి తెచ్చుకోవాలంటే మరొకరిపై ఆధారపడాల్సిందే. సీఎం చంద్రబాబు తన నిర్ణయాన్ని మరోసారి పరిశీలించాలి.

– మాటూరి సీతామహాలక్ష్మి, వృద్ధురాలు, దావులూరు

ఎండీయూ వాహనాలను కొనసాగించాలి



ప్రభుత్వం కల్పించిన రుణంతో 2021 నుండి ఎండీయూ వాహనాన్ని కొనుగోలు చేసుకుని దాని మీదే ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. సుమారు 1700 ఇళ్లకు రేషన్ సరుకులను అందిస్తూ వస్తున్నాను. కొంత మంది ఆపరేటర్లు రెండు వేల ఇళ్లకు రేషను ఇస్తున్నవారు ఉన్నారు. మా కుటుంబాలను ఆదుకోవాలి.

– సయ్యద్ సుభాని, ఎండీయూ ఆపరేటర్

ఇక రేషన్ కష్టాలు మొదలైనట్లే



గతంలో రేషన్ కోసం దుకాణాలకు వెళ్లి గంటల కొద్ది వేచి ఉండి బియ్యం తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది. అప్పటి సీఎం జగన్ రేషన్ పంపిణీ చేసే వాహనాలను ఏర్పాటు చేసి లబ్ధిదారుల ఇళ్లకే బియ్యం పంపారు. నేటి ప్రభుత్వం వాటిని తొలగించాలని ప్రకటించడంతో మరలా కష్టాలు మొదలయ్యాయనే భావన మమ్ములను వేధిస్తోంది.తన నిర్ణయంపై ప్రభుత్వం మరోసారి ఆలోచన చేయాలి. – వందల తిరుపతమ్మ, తెనాలి.

క్లుప్తంగా

విద్యా సామగ్రి పంపిణీ



తెనాలిఅర్బన్: ప్రభుత్వ పాఠశాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. వేజళ్ల వెంకటసుబ్బారావు స్మారక ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాహకులు నవ్య ఆధ్వర్యంలో బుర్రిపాలెం రోడ్డులోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం నోటు పుస్తకాలు, జామెట్రీ బాక్సులు, డ్రాయింగ్ వస్తువులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు స్వరూపరాణి, శివరామకృష్ణ, సీఆర్‌పీ శ్రీదేవి, టి.శివప్రసాద్, కె.శివరామకృష్ణ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: శ్రీ కాళికామాత దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో శివాజీ చౌక్‌లోని దేవస్థానం వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెల రెండోవ శుక్రవారం పేదలకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు మేక సురేష్, కందేపు సీతారామయ్య, నిరంజన్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, పి.రామకృష్ణ, హినుమంత్ పాల్గొన్నారు.

వ్యవసాయం రంగం కార్పొరేట్ పరం



కొల్లిపర: కేంద్ర ప్రభుత్వం, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నాలు రైతులు అందరూ కలిసి కట్టుగా ఉంది అడ్డుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉపాధ్యక్షుడు ములకా శివసాంబి రెడ్డి కోరారు. అఖిలభారత రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, వామపక్షాల పిలుపు మేరకు శుక్రవారం వల్లభాపురంలో క్విట్ కార్పొరేట్‌డే సందర్భంగా నిరసన తెలియజేశారు. కేంద్ర బడ్జెట్లో ఎరువులు మీద సబ్సిడీలు తగ్గించడం వల్ల రైతుపై భారం పడుతుందన్నారు. ధర్మయ్య వీరయ్య, సంసోను, అర్జునమ్మ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన



తెనాలిరూరల్: స్థానిక చెంచుపేటలోని కేఎస్ఎం హైస్కూల్‌లో బాలల హక్కులు, చైల్డ్ టోల్ ఫ్రీ నెంబర్(1098) పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గుంటూరు రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్, తెనాలి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. రాజారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఇన్‌స్పెక్టర్ అహ్మద్ ఖలీల్, గుంటూరు రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ టీమ్ మెంబర్ లక్ష్మణ్ నందన్, ఐసీడీఎస్ సూపర్వైజర్ వై.నాగమణి, ఏఎస్ఐలు ఎం.శివరామకృష్ణయ్య, ఆర్వీ శివారెడ్డి పాల్గొన్నారు.

బుర్రిపాలెంలో మెడికల్ క్యాంపు

తెనాలిరూరల్: సినీ నటుడు మహేష్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని విజయవాడకు చెందిన ఆంధ్రా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మహేష్‌బాబు స్వగ్రామం బుర్రిపాలెంలో శుక్రవారం భారీ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వైద్యులు సుమారు 155 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె జబ్బుల స్క్రీనింగ్ పరీక్షలు, రక్త పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. డాక్టర్ పీవీ రామారావు, డాక్టర్ సయ్యద్ ముసదిర్, డాక్టర్ సాయిప్రసాద్, డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ అమర్, డాక్టర్ రమేష్ వైద్య పరీక్షలు చేశారు.

12న అమరవీరుల సంస్మరణ దినోత్సవం

తెనాలి అర్బన్: రణరంగ చౌక్‌లో ఈ నెల 12న జరగన్ను అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో పెద్ద సంఖ్యలో పట్టణ వాసులు పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న కోరారు. సంస్మరణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీచౌక్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో పలువురు అశువులు బాసారాని గుర్తు చేశారు. వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రణరంగచౌక్‌వద్ద సోమవారం ఉదయం జరిగే కార్యక్రమంలో పలువురు స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబ సభ్యులను సన్మానించడం జరుగుతుందన్నారు. దానికి ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. అసిస్టెంట్ కమిషనర్ అనూష; ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏసీపీ సుబ్బారావు, ఇన్‌ఛార్జి ఎంఈ శ్రీనివాసరావు, డీఈ నాగభూషణం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, ఎన్‌సీసీ విద్యార్థులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తత తప్పనిసరి



మందులను పంపిణీ చేస్తున్న జడ్జి రాజశేఖర్

తెనాలిరూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రెండో అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) పి.రాజశేఖర్ అన్నారు. తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు ఆదేశాల మేరకు తెనాలి యడ్ల లింగయ్య కాలనీలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు, వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకుని, వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని చెప్పారు. గిరిజనులు, ఎస్టీలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. వైద్యులు కాలనీ వాసులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ దేవికా రాణి, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది షేక్ మహమూబ్, యర్రంశెట్టి అనిల్‌కుమార్, విజయ్, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలు.. ప్రజల పాలిట శాపాలు



ర్యాలీలో పాల్గొన్న బాబు ప్రసాద్, సాంబిరెడ్డి

తెనాలిఅర్బన్: కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రజల పాలిటా శాపాలుగా మారాయని సీఐటీయూ నాయకులు కొల్లిపర బాబుప్రసాద్ ఆరోపించారు. క్విట్ కార్పొరేట్ నినాదంతో ఏఐకెఎస్, సీఐటీయు, ఆల్‌ఇండియా కమిటీల పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలో నిరసన ర్యాలీని నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ బోసురోడ్డు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంభిస్తుందని విమర్శించారు. బ్యాంకుల బకాయిలు చెల్లించని కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు దేశంలో రూ.14 లక్షల కోట్ల రుణాలను బడా పారిశ్రామిక వేతలు చెల్లించలేదన్నారు. వారిలో ఎక్కువ మంది గుజరాత్ చెందిన వారు ఉన్నారు అన్నారు. రైతు సంఘం నాయకులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ ఎంఎస్ స్వామినాథన్ సిఫారస్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, యలమందయ్య, ఎం.సాంబశివరావు, జి.వెంకటసుబ్బయ్య, శేషగిరిరావు, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, సుబ్రమణ్యం, ఎస్.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవం



మాట్లాడుతున్న కేసీ బసవయ్య

తెనాలి: దళిత బహుజన రిసోర్సు సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం తెనాలిలోని యడ్ల లింగయ్య కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయవాదులు కేసీ బసవయ్య, గుమ్మడి రవిరాజు, సాంబశివరావు పాల్గొన్నారు. బసవయ్య మాట్లాడుతూ 1992 ఆగస్టు 9 న అటవీ వనరుల హక్కులను సంబంధించిన సమస్యలపై 26 మంది స్వతంత్ర మానవ హక్కుల మేధావులతో వర్కింగ్ గ్రూపుల సమావేశం జరిగినట్లు చెప్పారు. ఈ సమావేశంలో 140 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆదివాసుల కోసం కూడా ఒకరోజు ఉండాలని ఐక్యరాజ్యసమితి కమిటీ కోరగా ఆదివాసుల సంరక్షణ చట్టాలకు ఐక్యరాజ్యసమితి ఆమోదం తెలిపిందని చెప్పారు. ఈ కమిటీ 1992 నుండి పది సంవత్సరాలపాటు ప్రపంచ వ్యాప్తంగా తిరిగి ఆదివాసుల సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి విశ్లేషించి 1994 నుంచి 2014 వరకు ఆ మధ్య కాలాన్ని ఆదివాసులు అభివృద్ధి కాలంగా పరిగణించి ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవంగా ప్రకటించనట్లు తెలియజేశారు. గుంటూరు సిటీ కో–ఆర్డినేటర్ రమేష్, తెనాలి సిటీ కో–ఆర్డినేటర్ రాజశేఖర్, పాల్గొన్నారు.

అంగలకుదురు పీఏసీఎస్ తనిఖీ

తెనాలిరూరల్: అంగలకుదరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్)ను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఏసీఎస్ కంప్యూటరీకరణ, అందుకు సంబంధించిన హార్డ్‌వేర్ ఇన్‌స్టలేషన్ పూర్తైందా? లేదా?, డేటా మైగ్రాషన్‌కు సంబంధించిన సమాచారం డీసీటీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ స్వయంగా పరిశీలించారు. ఎంత మంది సభ్యుల సాచారాన్ని ఇప్పటి వరకు అప్‌లోడ్ చేశారని సిబ్బందిని అడుగగా 800 మందిన సాచారన్ని కంప్యూటరీకరించినట్టు తెలిపారు. జేసీ వెంట సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, సహకార అధికారి కేవీ రామారావు, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, జీడీసీసీ బ్యాంకు అధికారులు ఉన్నారు.

టీడీపీ నాయకుల అరాచకాలను అరికట్టాలి



రైల్వేస్టేషన్ ముందు అంబేద్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నేతల నిరసన

తెనాలిఅర్బన్: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులపై దాడులు చేయడమే కాకుండా గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన శిలాఫలాకాలను ధ్వంసం చేయడం విష సంస్కృతికి నిదర్శనమని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతివనంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం రైల్వేస్టేషన్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి తెనాలి పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడు బండ్ల మూడి నాని పాలాభిషేకం చేశారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరూ టీడీపీ నాయకులు ఇలాంటి చర్యలకు పాల్పడటం దుర్మాగమన్నారు. గవర్నర్, కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పిల్లి గంగాధర్, అక్కిదాసు కిరణ్‌కుమార్, కొండమూడి విజయ్, కిరణ్‌చంద్ర, విస్సా డేవిడ్, వేముల మహేష్, కందల ఏసుబాబు, కట్టా అనిల్, కనపర్తి ప్రకాష్, ఉన్నవ రాజేష్, కనపర్తి శశి, నల్లగండ్ల రవిచంద్ర, కసుకుర్తి నాగమల్లేశ్వరరావు, బడుగు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ మాసం.. పవిత్రం



ప్రత్యేక అలంకరణలో శ్రీ బాల త్రిపుర సుందరీదేవి



ప్రత్యేక అలంకరణలో పర్వత వర్ధనీ అమ్మవారు

తెనాలి: శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాల్లో విశేష పూజలు జరిగాయి. ఆలయాలు మహిళ భక్తులతో రద్దీగా కనిపించాయి. పలువురు మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. పట్టణ మారీసుపేటలోని బాలత్రిపుర సుందరీ సమేత శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో ఐదో తేదీ నుంచి జరుగుతున్న శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. బోసురోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. విశేష పూజలు జరిపారు. గంగానమ్మపేటలోని పర్వతీ వర్ధనీ సమేత శ్రీ రామేశ్వరస్వామి ఆలయంలో పలువురు భక్తులు పర్వతీ వర్ధనీ అమ్మవారిని దర్శించుకున్నారు. అదే ఆలయంలో అష్టభుజ దుర్గాదేవిని దర్శించుకున్నా రు. కొత్తపేటలోని అష్టలక్ష్మి అమ్మవారి ఆలయం శ్రావణ శుక్రవారం రోజున భక్తులతో కళకళలాడింది. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. దేవిచౌక్, శివాజీచౌక్ అమ్మవారి ఆలయాల్లోనూ శ్రావణ శుక్రవారం ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు జరిగాయి.

బాలికల గురుకుల పాఠశాలలో జేసీ ఆకస్మిక తనిఖీ



తెనాలి: గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ శుక్రవారం తెనాలిలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌తో కలసి చంద్రబాబునాయుడు కాలనీలోని పాఠశాలకు వెళ్ళిన భార్గవ్ తేజ, అక్కడి విద్యార్థినులతో మాట్లాడారు. అక్కడ వసతులు గురించి ఆరా తీశారు. విద్యార్థినులకు ఆదివాసీ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులతోనూ గురుకుల పాఠశాల సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు నీరు నిలిచి అసౌకర్యంగా ఉందని వారు తెలియజేశారు. అలాగే ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని జేసీకి విన్నవించారు. అనంతరం మధ్యాహ్న భోజనం సమయం కావడంతో విద్యార్థినులతో కలసి జేసీ, సబ్ కలెక్టర్ భోజనం చేశారు. వీరితో మండల తహసీల్దారు కేవీ గోపాకృష్ణ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి



సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌కు వినతి

తెనాలి అర్బన్: ఎస్సీ వర్గీకరణను పూర్తిగా రద్దు చేయాలని, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని ఎస్సీ ఉపవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు.. కొత్తపేటలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీల్లో క్రిమిలేయర్ విధానాన్ని ప్రవేశపెట్టాడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ఎస్సీ కుల గణన చేయాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దేశ వ్యాప్త ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌ను వినతిపత్రం ఇచ్చారు. కౌన్సిలర్ యాతాటి అనిల్, కనపర్తి అనిల్, యంగ్రపాటి ఆశోక్‌కుమార్, బేతాళ ప్రభాకర్, కంచర్ల కోటేశ్వరరావు, జి.సుందరరావు, యంగ్రపాటి స్టాలిన్, కంచర్ల కిషోర్, పెరికల డానియేల్, ఎం.రాజు, బోరుగడ్డ గిరి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రాజ్ చట్టానికి తూట్లు

తెనాలిరూరల్: మండలంలోని కొలకలూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీటీసీ కాళిశెట్టి ఫణికుమార్, జనసేన నాయకులు తోట నరేంద్ర మాట్లాడారు. పంచాయతీ సర్పంచ్ చొప్పర ప్రీతి పంచాయతీ రాజ్ చట్టానికే తూట్లు పొడుస్తోందన్నారు. పంచాయతీ రాజ్ చట్టం 1994, 227జీఓ ప్రకారం సాధారణ సర్వ సభ్య సమావేశం పంచాయతీ కార్యాలయంలోనే జరగాలని, ఆ సమావేశం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించామని ముందస్తుగా జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారిని కోరామన్నారు. అందుకు బదులుగా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి పంచాయతీ కార్యాలయంలోనే సమావేశం నిర్వహించమని సర్క్యులర్ జారీ చేశారని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలను ధిక్కరించి శుక్రవారం సమావేశాన్ని సచివాలయంలో నిర్వహించారని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తెనాలిరూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా తెనాలి పట్టణంతోపాటు మండల గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ బి. అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం

తెనాలి రూరల్: తెనాలి నాజరు పేటలోని అఖిలాంధ్ర సాధు పరిషత్ కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా పలు వ్యవహారాలు జరుగుతున్నాయని, ఇక్కడ జరుగుతున్న చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకోవాలని పరిషత్ పూర్వ సంయుక్త కార్యదర్శి, శాస్వత సభ్యులు ప్రణవానంద భారతి స్వామితో పాటు పలువురు మధ్యాహ్నం సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి పరిషత్ కార్యకలాపాలపై అధికారులకు ఫిర్యాదు చేశారు. పరిషత్ భవనంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రమాదకర రీతిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్నారని పేర్కొంటూ సబ్ కలెక్టర్ కార్యాలయ ఇన్చార్జి ఏవో సుధా కిరణ్‌మయికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రణవానంద భారతి స్వామి మాట్లాడుతూ.. ఈ సంస్థ 1965లో స్థాపించబడిందని చెప్పారు. దాతల వద్ద నుంచి పెద్ద మొత్తంలో విరాళాలు సేకరిస్తున్నారని, తాము ఎంత చెప్పినా వినకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రమాదకరంగా ఉన్న భవనంలో నిబంధనలు పాటించకుండా అనుమతులు లేకుండా మరో అంతస్తు నిర్మాణం చేపడితే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. వెంటనే భవనంలో అక్రమ నిర్మాణాలు నిలిపి వేయించాలని కోరారు. అఖిలాంధ్ర సాధు పరిషత్ పూర్వ ప్రధాన కార్యదర్శి శ్రీకృష్ణ నారాయణ, భక్తులు పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

తెనాలిరూరల్: తెనాలి నుంచి ప్రయాణికులతో చెరుకుపల్లి వెళుతున్న ఆర్టీసీ బస్సు చిన్న పిల్లాడితో సహా దంపతులు ప్రయాణిస్తున్న స్కూటీని ఢీ కొట్టింది. వైకుంఠపురం దేవస్థానం వద్ద శుక్రవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న వ్యక్తికి గాయాలు కాగా అతడిని 108లో ఆస్పత్రికి తరలించారు. స్కూటీపై ఉన్న మహిళ, బాలుడు తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన బస్సులోని ప్రయాణీకులతో పాటు అటుగా వెళుతున్న వాహనదారులు 108కి సమాచారం ఇచ్చి గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి పంపించారు. దీనిపై తమకు ఎటువంటి సమాచారం అందలేదని త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.